క్లుప్తంగా

చేయూత



జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన పేద విద్యార్థిని తాళ్లపల్లి స్పందన ఉన్నత చదువుల కోసం ఎన్ఆర్ఐ చాడా వినయ్‌కుమార్ రూ. 90 వేల సాయం అందజేసి చేయూతనందించారు. ఈ సాయం చెక్కును దాత తండ్రి రాంరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం బాలికకు అందజేశారు. స్పందన ఇంటర్ చదువుతున్న సమయంలో తండ్రి రాజు ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో డిగ్రీ చదివేందుకు స్పందన ఇబ్బంది పడుతోంది. విషయాన్ని తెలుసుకున్న వినయ్‌కుమార్ బాలిక చదువు కోసం సాయం అందజేశారు.

ఆర్థికసాయం



పాలకుర్తి: మండలంలోని విస్నూరు గ్రామానికి చెందిన బాలగాని కుమార్ ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. కాగా, శుక్రవారం బాధితుడికి ఎన్ఆర్ఐ గౌడ అసోసియేషన్ బాధ్యులు రూ. 50వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ట్రాన్స్‌కో అధికారి రవీందర్, అసిస్టెంటు కమిషనర్ చంద్రయ్య, మలక్‌పేట ఎస్సై నరేందర్, దూల్మిట్ట ఎస్సై సైదులు, ఆలేరు సీఐ దీపిక, పాలకుర్తి ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పద్మ, నాగన్న, యాకయ్య, సత్తయ్య, యాకయ్య, రాజు తదితరులు ఉన్నారు.

పొన్నాలకు ఘన స్వాగతం



జనగామ: అమెరికా పర్యటన ముగించుకొని తిరిగి స్వదేశానికి వచ్చిన మాజీ టీపీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యకు పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఎండీ మాజిద్, బుడిగె గురువయ్య, నాగమల్ల శ్రీనివాస్, గోవిందరెడ్డి, రఘు ఠాకూర్, కూరపాటి మధు, మహేష్, ఫయాజ్, రాజు, సతీష్ తదితరులు ఉన్నారు.

సన్మానం



పాలకుర్తి: మండలంలోని విస్నూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయురాలు కె.మాధురిని శుక్రవారం పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాటూరి యాకయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మాజీ సర్పంచ్ నకీర్త యాకయ్య, శోభ, బాలగాని నాగరాజు, బాలగాని యాకయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, శిల్ప, ఉజ్వల దేవి పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయుడికి..



తరిగొప్పుల: బదిలీలో భాగంగా పదోన్నతిపై వేరే స్కూల్‌కు వెళ్లిన ఉపాధ్యాయుడికి వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలబాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన బానోత్ రవీందర్ గెజిటెడ్ హెచ్‌ఎంగా నెల్లుట్లకు బదిలీపై వెళ్లారు. కాగా, పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బానోతు రవీందర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఎంఈఓ నెల్లుట్ల జానకి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు

జఫర్‌గఢ్: కోనాయిచలం అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీశ్, హెచ్‌ఎం దయాకర్‌రావు, ఉపాధ్యాయులు రాజమౌళి, అంగన్‌వాడీ టీచర్లు ఉపేంద్ర, గీతారాణి ఆయాలు సులోచన, సుమలత పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

- కంకర తేలి గుంతలమయం
- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని దుస్థితి



అధ్వానంగా ఉన్న కూనూర్ రోడ్డు



కంకర తేలి గుంతలమయమైన బీటీ రోడ్డు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఎన్నో ఏళ్లక్రితం వేసిన బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని బీటీ ఎగిరిపోయి కంకర తేలి గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మండల కేంద్రంలోని గ్రామ శివారు సాగరం క్రాస్ నుంచి కోనాయిచలం మీదుగా కూనూర్ గ్రామం వరకు బీటీ రోడ్డును నిర్మించింది. ప్రజలు కాజీపేట, హనుమకొండ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ రహదారి ఎంతో అనువుగా ఉండటంతో నిత్యం అనేక మంది ప్రయాణం సాగిస్తుంటారు. ప్రధానంగా కూనూర్ నుంచి కోనాయిచలం వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. వర్షాలు కురిసినప్పుడు కల్వర్టుల వద్ద రోడ్డు కోతకు గురికావడం, గుంతలు ఏర్పడడం పరిపాటిగా మారింది. ఇదే రహదారిలో కోనాయిచలం, సాగరం క్రాస్ రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టు కూడా కోతకు గురై ప్రమాదకరంగా తయారైంది. దీంతో ప్రయాణికులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులు తరచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతు చేపట్టి డబుల్ రోడ్డుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. కాగా, రోడ్డుకు తాత్కలిక మరమ్మతులు తప్ప పూర్తి స్థాయిలో పనులు చేపట్టడం లేదు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత మరమ్మతులతో పాటు రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చి ఇబ్బందులు తొలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

డబుల్ రోడ్డుగా మార్చాలి



రోడ్డు దెబ్బతిని ఎన్నో ఏళ్లు అవుతోంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డుపై వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తోంది. తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతు చేపట్టి డబుల్ రోడ్డుగా మార్చాలి.

\- రాయపురం భిక్షపతి, కూనూర్

ఎవరూ పట్టించుకోవడం లేదు



రోడ్డు పూర్తిగా దెబ్బతినడం వల్ల వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి హనుమకొండ, కాజీపేట వెళ్లేందుకు ఈ రహదారి ఎంతో అనువుగా ఉంది. ఇప్పటికైనా రోడ్డును బాగు చేసి ఈ మార్గంలో హనుమకొండకు ఆర్టీసీ బస్సులు నడిపించాలి.

\- శాగ యాదగిరి, కూనూర్

యూరియా కోసం రైతుల బారులు



యూరియా కోసం బారులుదీరిన రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. కేవలం ఒక్క బస్తా యూరియా కోసం రైతులు అరిగోస పడుతున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి హాకాసెంటర్‌కు శుక్రవారం 333 బస్తాల స్టాక్ రాగా పంపిణీ చేశారు. యూరియా స్టాక్ తక్కువగా ఉండటం, రైతులు అధిక సంఖ్యలో రాగా ఏఈఓ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు మధ్య రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. అయితే యూరియా బస్తాలు రాని రైతులు ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ వెనుదిరిగారు.

కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: పట్టణంలోని పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారని సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు పాము శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టణంలోని వార్డుల్లో ఫాగింగ్ చేయడంతోపాటు డ్రెయినేజీలను శుభ్రం చేసి కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. పూజారి సతీష్, వేముల రవీందర్, చిలువేరు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోచన్నపేటలో లోపించిన పారిశుద్ధ్యం

బచ్చన్నపేట: పోచన్నపేట గ్రామంలో పారిశుద్ధ్యం లోపించిందని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సామాజిక కార్యకర్త ఇంజ మనోహర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి నడవడానికి ఇబ్బందిగా మారాయన్నారు. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాలు కూడా సరిగా వెలగడం లేదన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నాయకత్వ లక్షణాలతోనే సమాజాభివృద్ధి



ప్రతినిధులతో ఫాదర్ దిలీప్‌కుమార్

దేవరుప్పుల: విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని ఫాదర్ దిలీప్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు అధ్యక్షతన విద్యార్థుల ప్రతినిధుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే తరగతి అభ్యున్నతి కోసం పాటుపడే ప్రతినిధి భవిష్యత్‌లో ఆశించిన లక్ష్యసాధనలో రాణిస్తారన్నారు. తరగతి ప్రతినిధులకు పాఠశాల యాజమాన్యం నూతన డ్రెస్ కోడ్ దుస్తులను పంపిణీ చేసి అభినందించారు. ఎన్‌సీసీ నిర్వాహకుల కృష్ణ, ఉపాధ్యాయులు మదన్ మోహన్, మహేష్, కృష్ణ, అనిత, మాధవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలు



జనగామ: గుడాల భూమయ్య జ్ఞాపకార్థం గుడాల ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం నిర్వహించే స్కూల్ లెవల్ చెస్ చాంపియన్ షిప్ పోటీలను పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్ 9–14 విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీల్లో లిఖిత, శివదత్త, రవిత్రిని, విజయ్‌లు ఫైనల్స్‌కి అర్హత సాధించారు. గెలుపొందిన విద్యార్థులను స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు కనకయ్య, కిషన్ అభినందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గుడాల శ్రీను, కో చైర్మన్ వేణు, శ్రీధర్‌లను స్కూల్ యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కాసాల సంతోష్ కుమార్‌తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



జనగామ: జిల్లా కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్ తల్లి జాయ యాదమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. కాగా, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గానిపాక మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్ధయ్య ఆమె పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. సర్వ నర్సింగ్‌రావు, వెంకట్‌రెడ్డి, ఎదునూరి రవి, శ్రీనివాస్, కాముని శ్రీనివాస్, మధు ఉన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయినులు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో పచ్చదనం, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ స్వప్న మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పచ్చదనం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీలతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం..

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు దేవాలయాల్లో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దం లింగస్వామి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సింగారపు రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హరికృష్ణ

కొడకండ్ల: ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని జిల్లా బీసీ వేల్ఫేర్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనర్సింహరావు కోరారు. శుక్రవారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రోగులకు డాక్టర్లు హరికృష్ణ, భారతి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషాద్రి సూరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబురాలు



వేడుకల్లో అధ్యాపకులు, సిబ్బంది

జనగామ రూరల్: పట్టణంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తుగా బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని అన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు, అంగన్‌వాడీలు

కొడకండ్ల: పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని అంగన్‌వాడీ టీచర్ బాల్నె రేణుక సూచించారు. శుక్రవారం రామవరం నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణఅభియాన్‌పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రీస్కూల్ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులతో విద్యార్థులు

నర్మెట: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని లయన్స్ క్లబ్ జోన్ మాజీ చైర్మన్ పజ్జూరి జయహరి అన్నారు. శుక్రవారం హన్మంతాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 48 మందికి క్లబ్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య పుట్టిన రోజు సందర్భంగా క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం దూడల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్లబ్ జనగామ అధ్యక్షుడు బండ దయాకర్, కార్యదర్శి బాబు, ట్రెజరర్ కాసం సుకుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి 9 నెలల జైలు

రఘునాథపల్లి: నిర్లక్ష్యంగా ట్రాలీ నడిపి ఒకరి మరణానికి కారకుడైన నిందితుడికి జనగామ ప్రిన్సిపల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జి. శశి శుక్రవారం తొమ్మిది నెలల జైలు, రూ.1,500 జరిమానా విధించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు. మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన పనికెర కొమురయ్య–లచ్చమ్మ దంపతులు వారి ద్విచక్రవాహనంపై 2 మార్చి 2015న నర్మెటకు వెళ్లి తిరిగివస్తున్నారు. బానాజీపేట శివారు శాంతిగిరి వద్ద హైదరాబాద్ చైతన్యపురికి చెందిన చిప్పలపల్లి సుభాశ్ ట్రాలీని నిర్లక్ష్యంగా నడుపుతూ కొమురయ్య దంపతుల ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో కొమురయ్య మరణించగా, లచ్చమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని చార్జ్‌షిట్ ఫైల్ చేశారు. ఎస్సై నరేశ్, కోర్టు కానిస్టేబుల్ సాయి కృష్ణ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.కిరణ్‌కుమార్ కేసును వాదించారు. న్యాయమూర్తి నిందితుడికి తొమ్మిది నెలల జైలు, జరిమానా విధించారు.

మంత్రిని కలిసిన మాజీ వైస్ ఎంపీపీ

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రత్యేక చొరవతో పనిచేయాలని కోరుతూ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మాజీ వైస్‌ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, తాటికొండ మాజీ సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో వినతిపత్రాన్ని అందించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంత్రిని కలిసిన వారు తాటికొండ చరిత్రను మంత్రికి తెలిపారు. తెలంగాణ వ్యవసాయ కమిషన్ మెంబర్ భవానిరెడ్డి, చల్లా ఇంద్రజిత్‌రెడ్డి తదితరులున్నారు.

లంబాడీల ఆత్మగౌరవసభకు తరలిన నాయకులు

రఘునాథపల్లి: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం జరిగిన లంబాడీల ఆత్మగౌరవ నిరసన సభకు మండలంలోని లంబాడీలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వివిధ గ్రామాలకు చెందిన లంబాడీలు మండల కేంద్రానికి చేరుకొని ప్రత్యేక వాహనాలలో వెళ్లారు. సభకు తరలి వెళ్లిన వారిలో ఎల్ జేఏసీ కన్వీనర్లు బానోత్ భిక్షపతినాయక్, కొర్ర రాజేందర్ నాయక్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాల్యానాయక్ తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి సాయం

చిల్పూరు: మండలంలోని కందుల రజిత–రమేశ్ కుటుంబ ఆర్థిక పరిస్థితులతో ఇంటి నిర్మాణం నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి శుక్రవారం రమేశ్ ఇంటి నిర్మాణానికి కావాల్సిన సామగ్రి, ఆర్థిక సాయాన్ని పంపించగా మాజీ ఎమ్మెల్యే రాజయ్య సమక్షంలో నాయకులు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

నారగోని రవిచంద్ర, వెన్నం మాధవరెడ్డి, నారగోని రాజు ఉన్నారు.

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

కొడకండ్ల: కొడకండ్ల నుంచి తొర్రూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రన్నింగ్‌లో టైర్ పంక్చర్ కాగా డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. శుక్రవారం సాయంత్రం కొడకండ్ల బస్టాండ్ నుంచి తొర్రూరుకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు మార్కెట్‌యార్డు వద్ద టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి రోడ్డు డీవైడర్ ఎక్కగా డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. బస్సులో 20 మందికి పైగా ప్రయాణికులుండగా ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

సిద్దం సోమయ్య మృతి తీరని లోటు

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన సీపీఎం, సీఐటీయూ రైస్‌మిల్ యూనియన్ నాయకులు సిద్దం సోమయ్య మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, జిల్లా కమిటీ సభ్యురాలు ఎండీ షబానా అన్నారు. శుక్రవారం వారు సోమయ్య మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. కాట సుధాకర్, శ్రీనివాస్, ఎస్‌కె ఎక్బాల్, నర్సింగం, బంగారు చిరంజీవి, శంషోద్దీన్, రామచంద్రం పాల్గొన్నారు.

విద్యార్థులకు అతిథి భోజనం

పాలకుర్తి: వావిలాల గ్రామం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భూపాలపల్లిలో పని చేస్తున్న వావిలాలకు చెందిన హెచ్‌ఎం అలువాల రవి శుక్రవారం అతిథి భోజనం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ పోతుగంటి నర్సయ్య తెలిపారు. విద్యార్థులకు చికెన్‌తో కూడిన భోజనం వడ్డించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తండ మల్లయ్య, రాజు అంజయ్య, కృష్ణయ్య, రాజ్‌కుమార్, గౌరి, సిఆర్‌పి సాంబయ్య, కిషన్, అరుణ పాల్గొన్నారు.

కుటుంబ ఆరోగ్య సంరక్షణలో మహిళల పాత్ర కీలకం

దేవరుప్పుల: ప్రథమ కుటుంబ ఆరోగ్య పరిరక్షణలో మహిళల పాత్ర కీలకమని స్త్రీ వైద్యనిపుణులు మాధవి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి రవితేజ పర్యవేక్షణలో జనగామ ఏరియా ఆస్పత్రి స్త్రీ వైద్యనిపుణులు(గైనిక్) మాధవి 98 మందికి వైద్యచికిత్సలు చేశారు. వైద్యురాళ్లు వెంకటలక్ష్మీ, ఏఎన్‌ఎం వసంత్,ఫార్మాసిస్టు నగేష్, స్టాఫ్‌నర్సులు శారద,శ్రీలత,ఎల్‌టి వేణు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి ఎస్సీ కాలనీకి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంజూరు చేసిన రూ.20 లక్షల సీసీ రోడ్డు పనులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లాల పురుషోత్తం, జనగామ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పర్ష సిద్దేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత వస్తువులపై అప్రమత్తంగా ఉండాలి



శశికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్సై సృజన్‌కుమార్

దేవరుప్పుల: వ్యక్తిగత వస్తువులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఊర సృజన్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్న రంబోజీగూడెంకు చెందిన పరీదుల శశిగౌడ్‌కు స్థానిక పోలీసులు సీఈఐఆర్ ఆచూకీ మేరకు లభ్యమైన ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి మనిషికి సెల్‌ఫోన్ వినియోగం తప్పనిసరిగా నెలకొన్న పరిస్థితుల్లో ఆయా కుటుంబాల సమగ్ర సమాచారంతోపాటు ఆర్థిక తదితర వ్యవహారాల గోప్యతను కలిగి ఉండే సెల్‌ఫోన్ దొంగిలించినప్పుడు వినియోగదారులు అనేక నష్టాలను చవిచూడాల్సి వస్తుందన్నారు. ఇలాంటి తరుణంలో ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకొని ప్రతి సమాచారాన్ని ఇతరుల తస్కరించుకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కడియం రాజీనామా ఎప్పుడు..?

- స్టిక్కర్లు అంటించిన బీఆర్‌ఎస్ నాయకులు



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రఘునాథపల్లి: విద్యావేత్త, నీతి, నిజాయితీకి మారుపేరుగా చెప్పుకుంటున్న మీరు.. బీఆర్‌ఎస్ కార్యకర్తల శ్రమతో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం గారు నీ రాజీనామా ఎప్పుడు అని కూడిన స్టిక్కర్లను బీఆర్‌ఎస్ మండలపార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో గోడలపై అంటించారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై కుమార్‌గౌడ్, మండల అధ్యక్షుడు ముసిపట్ల విజయ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం రాజీనామా చేయాలనే స్టిక్కర్లను ఆవిష్కరించారు. శ్రీహరి వెంటనే రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గూడ కిరణ్, దుబ్బాక హరీష్, కొయ్యడ స్వామి, బొంగు ఐలయ్య, చింతల బాలకృష్ణ, కోళ్ల శ్రీను, పరుశరాములు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని వినియోగించుకోవాలి



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న శివరామకృష్ణ

దేవరుప్పుల: స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని మండల విద్యాధికారి జి.కళావతి సూచించారు. శుక్రవారం ధర్మాపురం పరిధి మొండిచింత ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ డైమండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ 320 ఎఫ్ జిల్లా గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య రాజేశ్వరి దంపతుల జన్మదినం పురస్కరించుకొని క్లబ్ అధ్యక్షుడు గొడిశాల శివరామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం పెద్ది వీరారెడ్డి, జైని శంకర్, రజనీకాంత్ పాల్గొన్నారు.